క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకే అనుకూలం



కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు మాత్రమే అనుకూలంగా ఉందని, రైతులకు వ్యతిరేకంగా ఉందని రైతు సంఘం నాయకులు అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సోమవారం చిలకపాలెంలో నిరసన తెలియజేస్తూ బడ్జెట్ ప్రతులకు నిప్పంటించారు. ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహన్‌రావు మాట్లాడుతూ కేంద్ర, మధ్య తరగతి ప్రజలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. ఎరువుల రాయితీ, ఆహార భద్రత, ఉపాధి హామీ వంటి వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. బీహార్‌కు భారీగా నిధులు ఇచ్చిన కేంద్రం అమరావతికి రూ.15వేల కోట్లు అప్పు ఇస్తామనడం అన్యాయమన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజు దగ్గరలోనే ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు వెలమల రమణ, అమ్మన్నాడు పాల్గొన్నారు.

బెదిరిస్తున్నారని ఎస్పీకి ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: తన తమ్ముడు భార్య, వరసకు మరదలైన చీపురు లక్ష్మి చేసిన పనికి కొవ్వాడ గ్రామస్తులు తమను చంపుతామంటూ బెదిరిస్తున్నారని శ్రీకాకుళం నగరంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో నివసిస్తున్న మెడికల్ రిప్రజెంటేటివ్ కిల్లంశెట్టి నవీన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై సోమవారం ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. తన తమ్ముడు ప్రవీణ్‌తో చీపురు లక్ష్మి అలియాస్ సయ్యద్ షబ్నమ్ పెళ్లికాక ముందు, అయిన తర్వాత కూడా వడ్డీ వ్యాపారం నడిపేదని, ఆమె పలువురు వద్ద పెద్దమొత్తంలో డబ్బులు తీసుకొని వడ్డీలు నడిపేదని, వారికి అప్పు తీర్చకుండా మూడు సంవత్సరాల క్రితం తమ్ముణ్ని తీసుకుని పరారైందన్నారు. ఈ క్రమంలో ఆమెకు డబ్బులిచ్చేవాళ్లంతా తమ్ముడిని, మరదలిని అప్పజెప్పాలని, లేదంటే మీ కుటుంబీకులే కాబట్టి అప్పు మీరే తీర్చాలంటూ ఇంటిపైకి వస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

స్పీడ్ బ్రేకర్ల తొలగింపుపై ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న ఎంపీపీ మొదలవలస చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారి నుంచి ఫరీదుపేటకు వెళ్లే జెడ్పీ రోడ్డులో గల తన ఇంటి సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్లను టీడీపీ నాయకులు అక్రమంగా తొలగించారని జిల్లా కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్‌కు ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి ఫిర్యాదు చేశారు. జెడ్పీ సామావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీకోసం పబ్లిక్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే స్పీడ్ బ్రేకర్లను తొలించారన్నారు. దీనిపై వెంటనే ఎచ్చెర్ల పోలీస్ పోలీసులకు, జెడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేసినా స్పందించ లేదన్నారు. సమగ్ర దర్యాప్తు నిర్వహించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బస్సు నిలిపివేత



ఎచ్చెర్లలో బస్సు నిలిపివేసిన విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం నుంచి రాజాం వెళుతున్న బస్సును ఎచ్చెర్ల గ్రామ పరిధిలోని సర్వీస్ రోడ్డులో నిలపకపోవటంతో విద్యార్థులు సోమవారం సాయంత్రం బస్సును కొంతసమయం నిలిపివేశారు. బస్సు నిలపలేదని ఎందుకు డ్రైవర్, కండాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. కొంత సమయం తరువాత బస్సు కదిలింది. విద్యార్థులు సంఖ్య ఎక్కువగా ఉండటం, బస్సులో ప్రయాణికులు సామర్థ్యం పరిమితంగా ఉండటంతో ప్రతి రోజూ ఈ సమస్య ఎదురవుతుంది.

కిరీటం కోసం విరాళం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో వేంచేసిన భూ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని స్వామివారికి బంగారు కిరీటం చేయించే నిమిత్తం పలువురు కలిసి మూడు గ్రాముల బంగారం, రూ.33 వేలు విరాళంగా అందచేశారని అర్చకులు గోపాలాచార్యులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూన జశ్రిత ఆద్య మూడు గ్రాముల బంగారం, ఎస్ఎస్ రామారావు, లలిత దంపతులు రూ.10 వేలు, సత్యన్నారాయణమూర్తి, లక్ష్మి దంపతులు రూ.3 వేలు, యు.వేంకటనరసింహం, నాగశైలజలు రూ.10 వేలు, పి.మురళీకృష్ణ, లక్ష్మిలు రూ.10,501 విరాళంగా ఇచ్చారన్నారు. ఇంకా ఎవరైన విరాళం ఇద్దామనుకుంటే ఆలయ కమిటీని సంప్రదించాలని కోరారు.

● సత్కారం



ప్రముఖ కవి, రచయిత, కవితామయం సంస్థ అధ్యక్షుడు మహ్మద్ రఫీ (ఈవేమన)కి కాకినాడ జిల్లాలో పి.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీశ్రీ కళావేదిక గోదావరి జాతీయ కవితోత్సవంలో భాగంగా కళావేదిక ఆదివారం సత్కరించింది. 'పోరాటం' అనే కవితకు పురస్కారం ప్రదానం చేసినట్లు ఈమేమన సోమవారం తెలిపారు. అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, కన్వీనర్ కొల్లి రమావతి తదితరులు ఈవేమనను సన్మానించారు. ఈ ప్రక్రియలో భాగంగా కళావేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షుడిగా ఈవేమనను ఎన్నుకున్నారు.

- రణస్థలం

● పురస్కారం..



శ్రీకాకుళం నగరానికి చెందిన అభినయ నృత్య నికేతన్ నృత్య దర్శకురాలు డాక్టర్ టి.నీరజా సుబ్రహ్మణ్యానికి అరుదైన గౌరవం దక్కింది. సింహాచలం లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, విజయవాడ మువ్వగోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ వారి సంయుక్త నిర్వహణలో ఆదివారం నృత్య నిరాజన కార్యక్రమం దేవస్థానం ఆవరణలో జరిగింది. రాష్ట్ర స్థాయిలో పలు జిల్లాల నుంచి నృత్య కళాకారులు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన అభినయ నృత్య నికేతన్ చిన్నారులు గాయత్రి, లావణ్య, శ్రీహర్షిత, మేఘన, విశిష్ట తదితర 30 మందిచే వేంకటేశ్వర కల్యాణం, పలు నృత్యాంశాలు ప్రదర్శించారు. వీరికి సింహాచల దేవస్థానం ధ్రువపత్రాలను, జ్ఞాపికలను అందచేశారు. నీరజకు నాట్యవరిష్ట పురస్కారంతో సత్కరించారు. మువ్వగోపాల ఆర్ట్స్ అకాడమి ఆర్గనైజర్ నందిరాజు అరుణకల్యాణి, సాయినృసింహ కృష్ణ పాల్గొన్నారు.

-శ్రీకాకుళం కల్చరల్

● శిక్షణ..



శ్రీకాకుళం నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న సత్యసాయి సేవా సమితి బృందావనంలో జూట్ బ్యాగ్స్ విత్ స్క్రీన్ ప్రింటింగ్‌పై 40 రోజుల శిక్షణ శిబిరాన్ని రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు సోమవారం ప్రారంభించారు. 60 మంది మహిళలకు శిక్షణ ఇస్తామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఏడు చోట్ల తమ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్టు లక్ష్మణరావు చెప్పారు. జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి కె.నాగప్రసాద్, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ మహిళా ఇన్‌చార్జి అమ్మాజీ, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి, జిల్లా సేవాదళ్ సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, నేషనల్ నారాయణసేవ జిల్లా ఇన్‌చార్జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

-శ్రీకాకుళం కల్చరల్

పాఠశాలల్లో సహపంక్తి భోజనాలు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రెల్లవీధిలో విద్యార్థులతో హర్షవల్లి లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రభుత్వ పాఠశాలల్లో వారం రోజులు నిర్వహించిన శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. చివరి రోజున పిల్లలు, తల్లిదండ్రులు, స్థానికులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. శ్రీకాకుళం స్థానిక రెల్లవీధి పురపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శిక్షా సప్తాహ తిథి భోజన్‌లో భాగంగా హర్షవల్లి లయన్స్ క్లబ్.. లయన్ హారికా ప్రసాద్ 316–ఏ విద్యా సంక్షేమ చైర్మన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలలో తాము భాగస్వాములం అవుతామన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే తమ క్లబ్ లక్ష్యమన్నారు. కార్యక్రయంలో అధ్యక్షులు వావిలపల్లి జగన్నాథంనాయుడు, విద్యాశాఖ ఏడీ శ్రీనివాసరావు, జోన్–3 చైర్‌పర్సన్ కరణం శోభారాణి, కార్యదర్శిమణిశర్మ, ఉపాధ్యక్షులు తర్లాడ అప్పలనాయుడు, ఎంఈఓ కృష్ణారావు, హెచ్ఎం వేదవతి, శ్రీకుమార్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో..

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగరంలోని చౌదరి సత్యన్నారాయణ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భోజనాలను అందించారు. ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు పాల్గొన్నారు. జాతీయ నూతన విద్యావిధానం ప్రవేశపెట్టిన తరువాత పరివర్తనాత్మక సంస్కరణలపై, విద్యాభివృద్ధి చేయడంలో నిబద్ధత వెలికితీయడమే శిక్షా సప్తాహ్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవిందరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.



రణస్థలం: కొచ్చెర్లలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ



ఎచ్చెర్ల: విద్యార్థులకు జిలేబీలు వడ్డిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధి కిల్లిపాలెం గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్లో శుభదిన్ భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందరూ సహపంక్తి భోజనాన్ని చేశారు. ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, బలివాడ కరుణశ్రీ, డి.వి.ఎస్.పట్నాయక్ పాల్గొన్నారు.

రణస్థలం మండలంలో..

రణస్థలం: విద్యార్థులకు శుచిగా, రుచిగా ఉండే భోజనం పెట్టాలని ఎంఈఓ బి.లావణ్య అన్నారు. మండలంలోని కొచ్చెర్ల ప్రాథమికొన్నత పాఠశాలలో శుభదిన్ భోజన కార్యక్రమంలో ఆమె పాల్గొని మధ్యాహ్నం భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 118 పాఠశాలలోనూ ఇదే విధంగా నిత్యం పిల్లలకు చక్కటి భోజనం మెనూ ప్రకారం పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బస్వ లలిత, ఎంపీటీసీ బస్వ గోవిందరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ముద్దాడలో..

ఎచ్చెర్ల: మండలంలోని ముద్దాడ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుభదిన్ భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. మరువాడ రామారావు అందించిన జిలేబీలను పిల్లలకు అందించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించిన వారికి హెచ్ఎం ఎస్.నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు నాగలక్ష్మి, అమరావతి గణపతిరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: భోజనం వడ్డిస్తున్న శ్రీనివాసరావు



శ్రీకాకుళం రూరల్: సామూహిక భోజనాలు చేస్తున్న దృశ్యం

జిల్లా బీచ్ కబడ్డీ జట్లు ఖరారు



జిల్లా బీచ్ కబడ్డీ జట్లకు ఎంపికైన క్రీడాకారులతో కబడ్డీ సంఘ ప్రతినిధులు, సెలెక్టర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ బీచ్ కబడ్డీ జట్లు ఖరారయ్యాయి. ఈ నెల 28వ తేదీన శ్రీకాకుళం నాగావళి నది సమీపంలో నిర్వహించిన ఎంపికల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో కూడిన జిల్లా జట్లను ప్రకటించారు. ఆరుగురేసి చొప్పున పురుషులు, మహిళా క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపికచేశారు. ఎంపికైన క్రీడాకారుల జాబితాను శ్రీకాకుళం జిల్లా కబడ్డీ, బీచ్ కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాధు శ్రీనివాసరావు వెల్లడించారు. జిల్లా జట్లను ఆగస్టు 2 నుంచి 4వ తేదీ వరకు నెల్లూరు జిల్లా వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు పంపించనున్నట్టు చెప్పారు.

పురుషుల జట్టు: పి.యోగేంద్ర (సింగుపురం), పి.మణికంఠ (పాలకొండ), పి.గణేష్ (పాలకొండ), పి.పవన్ (కవిటి), పి.తరుణ్ (శ్రీకాకుళం), ఎస్.రామ్మోహనరావు (అక్కులపేట).

మహిళల జట్టు: హర్షిత (పల్లిసారధి), ఎస్.హసీన (తోటపాలెం), కె.శ్రావణి (రణస్థలం), టి.లీష, టి.యమున, బి.సింధుజ (పల్లిసారధి) ఎంపికయ్యారు.

ఉత్సాహంగా తైక్వాండో క్రీడాకారుల ఎంపిక



తైక్వాండో ఎంపికలను ప్రారంభిస్తున్న తైక్వాండో సంఘ ఏపీ ఉపాధ్యక్షులు శ్రీను

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి తైక్వాండో క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. విజయనగరం జిల్లా వేదికగా వేదికగా ఆగస్టు 9,10 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలను శ్రీకాకుళం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టౌన్‌హాల్ వేదికగా నిర్వహించారు. జూనియర్ బాలికల విభాగంలో అండర్–42 కేజీల విభాగంలో బండి శిరీష, అండర్–68+ విభాగంలో శిమ్మ నవ్య, అండర్–68 కేజీల విభాగంలో గొల్లంగి దుర్గా భవానీలు ఎంపికయ్యారు. జూనియర్ బాలుర విభాగంలో అండర్–45 కేజీల విభాగంలో దనాల అక్షయ్‌కుమార్, అండర్–59 కేజీల విభాగంలో రవ్వ వెంకట ప్రీతమ్ ఎంపికయ్యారు. కాగా ఈ ఎంపిక పోటీలకు న్యాయనిర్ణేతలగా తైక్వాండో గౌతమ్, సాయిబాలాజీ, గణసాయిలు వ్యవహరించగా కోచ్‌లు తైక్వాండో నవీన్, శాప్ కోచ్ లక్ష్మణరావు, జోగిపాటి వంశీ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా సాగుతున్న తైక్వాండో ఎంపిక పోటీలు

రాష్ట్రస్థాయి వర్క్‌షాపు పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం రూరల్: మునసబుపేటలోని గురజాడ విద్యాసంస్థల్లో ఆగస్టు 18న తెలుగు విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వర్క్ షాపు జరగనుంది. దీనికి సంబంధించిన పోస్టర్లను విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కథలు, కవితలు, వ్యాస రచనల నిమిత్తం తగిన అవగాహన కల్గించేందుకు వర్క్‌షాపులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి వర్క్‌షాపు ఎంతో ఉపయోగపడుతోందన్నారు.

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.వి.వి.సత్యన్నారాయణ, ఐక్యూ సమన్వకర్త మార్తాండ కృష్ణ, తెలుగు విభాగపతి భమిడిపాటి గౌరిశంకర్ ఉన్నారు.

బేబీ ఫీడింగ్ రూమ్ ప్రారంభం



ఫీడింగ్ రూమ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: పాలిచ్చే తల్లులకు ప్రత్యేక గది అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మీ కోసం కార్యక్రమానికి వచ్చే పాలిచ్చే తల్లులకు, మహిళలకు, జిల్లా పరిషత్‌లో పనిచేసే మహిళా ఉద్యోగులకు ఉపయోగపడేలా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా ఒక గదిని ఫీడింగ్ రూమ్‌గా ఏర్పాటు చేశారు. దీన్ని కలెక్టర్ ప్రా రంభించారు. ఆడపిల్లల జననాల రేటును పెంచడానికి, ఆడపిల్లలను రక్షించడానికి, బేటీ బచావో బేటీ పడావో కింద బేబీ ఫీడింగ్ రూమ్‌లను తెరవడం జరిగిందన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పంచాయతీ రాజ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపా రు. శ్రీకాకుళం, టెక్కలి, పలాస, నరసన్నపేట ఆర్టీసీ బస్టాండ్‌లో బేబీ ఫీడింగ్ రూమ్‌లు త్వరలో ప్రారంభిస్తామన్నారు.

కాశ్యపదాస్ బాబా మృతికి సంతాపం



కాశ్యపదాస్ బాబా (ఫైల్)

కంచిలి: యువతను సన్మార్గంలో నడిపిస్తూ, చెడు వ్యసనాలకు దూరంగా ఉండే విధంగా తన బోధనలతో చైతన్యపరిచే అలేఖ్ గురు వు కాశ్యపదాస్ బాబా ఆదివారం మృతి చెందారు. ఒడిశా రాష్ట్రం నుంచి సుమారు వందేళ్ల క్రితం తలతంపర గ్రామానికి వచ్చి అలేఖ్ ఆశ్రమాన్ని నెలకొల్పినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈయన వయసు వందే ళ్ల పైబడి ఉంటుంది. బాబా మృతి సమాచారం తెలుసుకున్న పరిసర గ్రామాలతోపాటు ఒడిశా రాష్ట్రంలోని సుదూర ప్రాంతాల నుంచి కూడా ఆయన శిష్యులు తరలివచ్చి పార్థివదేహానికి నివాళులర్పించారు. అంతిమ సంస్కారాలను తలతంపర గ్రామంలోని ఆశ్రమం ప్రాంగణంలోనే నిర్వహించారు. బాబా మృతిపై పలువురు సంతాపం తెలియజేశారు.

కృష్ణమూర్తికి సేవాశ్రీ అవార్డు ప్రదానం



పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణమూర్తి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన దక్కత కృష్ణమూర్తి రోటరీ క్లబ్ ద్వారా అందించిన సేవలను గుర్తించి రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ వారు సేవాశ్రీ అవార్డును ప్రదానం చేశారు. విశాఖలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఆదివారం రాత్రి జిల్లా రోటరీ ఇన్‌స్టాల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 28 సంవత్సరాలుగా ఇచ్ఛాపురం రోటరీ క్లబ్ అధ్యక్షులుగా, కార్యదర్శిగా, గవర్నర్గా, అసిస్టెంట్ గవర్నర్‌గా కృష్ణమూర్తి అందించిన సేవలను గుర్తించిన రోటరీ ఇంటర్నేషనల్ డెరెక్టర్ రాజు సుబ్రహ్మణ్యం సేవాశ్రీ పురస్కారంతో సత్కరించారు. స్థానిక రోటరీక్లబ్ అధ్యక్షులు దినేష్, రోటేరియన్స్ అభినందించారు.


బిల్లులు చెల్లించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

ఎచ్చెర్ల : లావేరు మండలంలోని గ్రామ సర్పంచ్‌లకు బిల్లులు లేక ఇబ్బందులు పడుతున్నామని, బిల్లులు పంపించాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సర్పంచ్‌లంతా కలిసి సోమవారం వినతిపత్రాన్ని అందించారు. గ్రామాల్లో నిధులు లేక అవస్థలు పడుతున్నామన్నారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బిల్లులు పంపించాలని కోరారు. మౌలిక వసతుల కల్పనకు, గ్రామాల్లో కనీసం పారిశుద్ధ్య చర్యలకు కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చాంద్ భాష, సీనియర్ నాయకులు దాశెట్టి తిరుపతిరావు, నాయన పైడిరెడ్డి, పెయ్యిల లక్ష్మణరావు, గొర్లె ప్రభాకర్‌నాయుడు, ఎల్లంనాయుడు, ఆదినారాయణ, దుర్గాశి ధర్మారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వాసుదేవరావు

శ్రీకాకుళం రూరల్: ద్విచక్ర వాహనాలను నడుపుతున్న మైనర్లకు సింగుపురం జంక్షన్ వద్ద శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వాసుదేవరావు సోమవారం అవగాహన కల్పించారు. విధిగా హెల్మెట్ వాడాలని, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ చక్రవర్తికి, ఎంఈఓ కె.పున్నయ్యకు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, జిల్లా కార్యదర్శి గొంటి సురేష్, యూనియన్ సభ్యులు సోమవారం వారి కార్యాలయాల్లో వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని, జీఓ ఎంఎస్ నంబర్ 53 మేరకు ఉపాధ్యాయుల కేటాయింపులు జరపాలని, 1 నుంచి 5 వరకు తరగతులను ఒకే పాఠశాలలో నడపాలని కోరారు. పరీక్షల్లో రాష్ట్రం యూనిట్‌గా ఒకే సిలబస్ అమలు చేయాలని, కిలో మీటరు దాటిన పాఠశాలలకు రవాణా సౌకర్యం కల్పించాలని, మధ్యాహ్న భోజనంలో మెరుగైన మెనూ అమలు చేయాలని విన్నవించారు. యూనియన్ నాయకులు రాము, విశ్వనాథం, రమేష్, రామారావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గార పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: గార పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సోమవారం ఆకస్మిక సందర్శించారు. పలు ముఖ్యమైన రికార్డుల నిర్వహణ క్షుణ్ణంగా పరిశీలించి, సిబ్బంది విధులు, పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్ కేసులపై నిర్లక్ష్యం చేయకూడదని, రాత్రి వేళల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ చేసి నేర నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి అక్రమ రవాణా అరికట్టాలని, అసాంఘిక కార్యకలాపాలు నియంత్రించాలని సిబ్బందికి సూచించారు.

సాంకేతిక ప్రగతిని అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

ఎచ్చెర్ల క్యాంపస్: సాంకేతిక ప్రగతి అందిపుచ్చుకుంటే దేశం శరవేగంగా ప్రగతి సాధిస్తుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ అన్నారు. వర్సిటీ సెమినార్ హాల్లో రీసెర్చ్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన మెషన్ లెర్నింగ్ అల్గారిథం ఫర్ రియల్ టైమ్ అప్లికేషన్ అంశంపై మాట్లాడారు. ప్రస్తుతం కృత్రిమ మేథ, మిషన్ లెర్నింగ్ వంటి సాంకేతిక పరిజ్ఞానం వల్ల పరిశ్రమల్లో ఉత్పాదకత పెరుగుతుందన్నారు. ప్రతీ అంశంలో సాంకేతికత విస్తరిస్తుందన్నారు. మానవ రహిత సేవలు కూడా మరింత విస్తరిస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో డేటా సైన్స్, కృత్రిమ మేథ, మిషన్ లెర్నింగ్ వంటి సాంకేతిక సేవలు పరిశ్రమ, సేవా, రవాణా అన్ని రంగాల్లో విస్తరిస్తున్నాయన్నారు. తక్కువ ఖర్చుతో మెరుగైన సేవలు అందుతాయన్నారు. రీసెర్చ్ ఫోరం ప్రతినిధులు ఎస్.సంతోష్, రంగనాథ్, ఎన్.మధులత పాల్గొన్నారు.